క్లుప్తంగా

కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ హేమలత, కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. విజయ దశమి సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు, కమిషనర్ వెంకట్రామ్‌తో కలిసి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకుమార్, జపాల భావన, సప్పిడి లావణ్య, రాజమౌని రాజు, బాకీ విలాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్లు, ముదిరాజ్ నాయకులు

మీర్‌పేట: పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు ముదిరాజ్ మహాసభ మీర్‌పేట కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం చందన చెరువు కట్టపై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధికి సాయన్న కృషి చేశారని పేర్కొన్నారు. నిజాం పాలనలో పీడిత వర్గాలకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన విగ్రహాన్ని త్వరలో ఆవిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌యాదవ్, సిద్దాల బీరప్ప, గజ్జెల రాంచందర్, స్థానిక నాయకులు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, యాదగిరి ముదిరాజ్, లక్ష్మణ్ ముదిరాజ్, రాజు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లోని శ్రీవిద్యాటౌన్‌షిప్, 13వ డివిజన్‌లోని సుల్తాన్‌పూర్ టౌన్‌షిప్ కాలనీల్లో సీసీ, బీటీరోడ్ల పనులను సోమవారం మేయర్ పారిజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తామని కాలనీవాసులకు హామీనిచ్చారు. కాలనీల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు బాలునాయక్, సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారునికి చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్

తుక్కుగూడ: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాటిందని కౌన్సిలర్ రవినాయక్ అన్నారు. మున్సిపాలిటీ 10వ వార్డుకు చెందిన నగేష్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చుల నిమిత్తం బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.22 వేల చెక్కును కౌన్సిలర్ రవినాయక్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో ఆర్థిక సాయం అందినట్లు వెల్లడించారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన నాయకులు



మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

చేవెళ్ల: జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా ఎన్నికైన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని చేవెళ్ల మండలంలోని పామెన గ్రామ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నగరంలోని ఆయన నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాకప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో పామెనకు చెందిన మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి ఎర్ర గోపాల్, యూత్ ప్రధాన కార్యదర్శి డి.కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.



పహాడీషరీఫ్: శ్రీరాంకాలనీలో అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు



పహాడీషరీఫ్: అమ్మవారి పూజలో పాల్గొన్న కార్తీక్‌రెడ్డి తదితరులు

ఘనంగా శరన్నవరాత్రోత్సవాలు



మహేశ్వరం: శ్రీలలితాత్రిపుర సుందరిదేవి అలంకారంలో అమ్మవారు



తుక్కుగూడ: మహాచండీదేవిగా అమ్మవారు



మహేశ్వరం: శివగంగ ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

లలితా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదోరోజు లలితా త్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చింది. ఆలయంలో భక్తులు అమ్మవారికి, పరమ శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, అభిషేకం, సహస్రనామార్చన, లలితా త్రిపుర సుందరీదేవి హోమం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, లలితా త్రిపురసుందరీదేవి సహస్రనామ కుంకుమార్చన, మహామంగళ హారతి, భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు. ఆలయంలో ఏపూరి స్రవంతి–రాజు దంపతులు హోమం నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఆలయ మాజీ చైర్మన్ మునగపాటి నవీన్, మాజీ ఎంపీటీసీ పి.సుదర్శన్‌యాదవ్, ఆలయ ఈఓ మురళీకృష్ణ, ఆలయ డైరెక్టర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

శ్రీరాం కాలనీలో..

పహాడీషరీఫ్: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలో ప్రతిష్ఠించిన కనకదుర్గ అమ్మవారిని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రవికుమార్, కౌన్సిలర్ బుడుమాల యాదగిరి, నాయకులు పందుల వెంకటేశ్‌గౌడ్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

తుల్జా భవానీ మాత ఆలయంలో..

జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలో గల తుల్జా భవానీ మాత ఆలయం, యంగ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గమాత అమ్మవార్లను బీఆర్‌ఎస్ సీనియర్ నేత పట్లోల్ల కార్తీక్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన వేడుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్, యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ వై.అర్జున్, 19వ వార్డు కౌన్సిలర్ పల్లపు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

మహాచండీదేవిగా..

తుక్కుగూడ: మున్సిపాలిటీ రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు కొనసాగుతున్నాయి. ఐదోరోజు సోమవారం అమ్మవారు శ్రీ మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మహాయజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, అర్చరులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మరు

బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్



పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేయిస్తున్న శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. సోమవారం బడంగ్‌పేట్ చౌరస్తాలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టగా అందెల శ్రీరాములుయాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ సభ్యత్వాన్ని ప్రజలు స్వచ్ఛందంగా తీసుకుంటున్నారన్నారు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ పాలన నచ్చిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, సభ్యత్వ నమోదు కన్వీనర్ నడికుడి యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, నాయకులు సామ సంజీవరెడ్డి, నర్సింహారెడ్డి, రాజు, చిత్రం శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, సాయిసంతోష్, మహేందర్, శరత్‌చంద్ర, ప్రవీణ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కేశంపేట సీఐగా నరహరి



సీఐకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌ఐ

కేశంపేట: కేశంపేట పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌ఓగా ఎస్‌ఐ విధులు నిర్వహించేవారు. కొత్తగా సీఐని ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. ప్రభుత్వ బదిలీల్లో భాగంగా ఎకనామిక్ ఆఫీసెస్ వింగ్ నుంచి నరహరి బదిలీపై వచ్చారు. సోమవారం నూతన సీఐగా నరహరి బాధ్యతలు స్వీకరించారు. సీఐకి ఎస్‌ఐ రాజ్‌కుమార్‌తో పాటు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంనగర్ కాలనీలో శ్రీభక్తమార్కండేయ పద్మశాలి పరస్పర సహాయక పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారుచేసి ఆడిపాడారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

జీపీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు జంగయ్య

షాద్‌నగర్: జీపీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్‌కు తరలివెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. తెల్లవారింది మొదలు గ్రామాల పరిశుభ్రతకు కార్మికులు ఎంతో శ్రమిస్తుంటారన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని కార్మికులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో పండగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మూడునెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు చంద్రయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీ ప్రజావేదిక

కొందుర్గు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ శ్రీలత హాజరయ్యారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 465 పనులకు సంబంధించిన ఖర్చుల వివరాలు, ఈ పనుల నిర్వహణలో జరిగిన అవకతవకలను వెలికితీయడానికి సామాజిక తనిఖీ బృందం ఎస్‌ఆర్పీలు వెంకన్న, యాదగిరిగౌడ్‌లతో పాటు 12 మంది డీఆర్పీలు సెప్టెంబర్ 26 నుంచి గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించారు. అదేవిధంగా గ్రామాలకు సంబంధించిన వివరాలను ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వెల్లడించారు. కాగా సోమవారం మండల ప్రజావేదిక నిర్వహించి ఎస్‌ఆర్పీలు వివరాలను వెల్లడించారు. అయితే ఉదయం ప్రారంభం కావాల్సిన ప్రజావేదిక కార్యక్రమం జిల్లా అధికారులు ఆలస్యంగా హాజరు కావడంతో సాయంత్రం 3 గంటలకు ప్రజావేదిక ప్రారంభమైంది. రాత్రి వరకు ఈ కార్యక్రమం కొనసాగుతోందని వివరించారు. ఇందులో ఏపీడీ శరణ్‌గౌతమ్, అంబుడ్స్‌మెన్ సునిత ఉన్నారు.

వైభవంగా గరుడ వాహనసేవ



గరుడ వాహన సేవ ఊరేగింపు

పహాడీషరీఫ్: మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గరుడ వాహన సేవ నివేదన కనుల పండువగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో పండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సోమవారం బాలభోగం, హవనం, విష్ణు సహస్ర పారాయణం, నిత్య పూర్ణాహుతి, హనుమంత సేవా కార్యక్రమాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుధీర్ కుమార్ పర్యవేక్షణలో కొనసాగుతున్న వేడుకల్లో.. భక్తులకు ఎలాంటి అసౌర్యాలు కలగకుండా ఈఓ మురళీ కృష్ణ మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దాత దామోదర్ సచిన్ సోని, కాంగ్రెస్ నాయకులు లాల్ సతీష్ గౌడ్, ఆదిల్ల జంగయ్య, లాల్ శేఖర్ గౌడ్, చెన్నయ్య, నరేష్ గౌడ్, శేఖర్ ముదిరాజ్, నరేందర్, అనిత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

దసరా లోపు జీతాలు ఇవ్వండి



ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కందుకూరు: విజయదశమి లోపుగా గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ.. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు గుర్తింపు కార్డులు, మాస్కులు, గ్లౌజులు, యూనిఫామ్స్ అందజేస్తామని మూడు నెలల క్రితం ఎంపీడీఓ హామీ ఇచ్చారని, కానీ నేటికీ అమలు చేయలేదని పేర్కొన్నారు. దసరా లోపుగా కార్మికులకు జీతాలతో పాటు, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎంపీడీఓ.. కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ జీపీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసినట్లు కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో కారోబార్‌లు బాల్‌రాజ్‌గౌడ్, మాధవ్, మిలన్, జంగయ్య, నరసింహ, పాండు, బాలయ్య, కార్మికులు యాదమ్మ, బాలమ్మ, సుగుణమ్మ, పద్మరాణి, నర్సమ్మ, పెంటమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



కందుకూరు సీఎస్‌సీ మీ-సేవ సెంటర్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థినులు



నేదునూరులోని బొటిక్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు స్కూల్ నిర్వాహకులు ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని కల్పిస్తున్నారు. తరగతి గదిలో నేర్చుకున్న చదువును వాస్తవ ప్రపంచ పరిస్థితులకు వర్తింపజేయడానికి ఇంటర్న్‌షిప్‌లు ఉపయోగపడనున్నాయి. అందులో భాగంగా ఐటీ విద్యార్థులు కందుకూరులోని సీఎస్‌సీ మీ–సేవ సెంటర్‌లో, అప్పెరల్ కోర్సు విద్యార్థులు నేదునూరులోని సాయిగణేశ బొటిక్‌లో ఇంటర్న్‌షిప్‌లు చేస్తున్నారు. ఇంటర్న్‌షిప్ పదిరోజుల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విష్ణుప్రియ మాట్లాడుతూ.. ఇంటర్న్‌షిప్‌లు విద్యార్థుల కెరీర్ అన్వేషణకు, అభివృద్ధికి, నూతన నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడానికి విలువైన సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థులందరూ పాల్గొనాలని కోరారు. ఉపాధ్యాయులు నరేందర్, నాగమణి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

రైతులకు కంది విత్తనాల పంపిణీ

షాబాద్: షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేసినట్లు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపెల్లి రత్నాకర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల ఉపప్రణాళిక ద్వారా కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుసుమ పంటలో అంతర పంటగా కందిసాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. సస్యరక్షణ పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా ఆదాయం పెంపు వంటి విషయాలు వివరించారు. రైతులు పీసరి మాధవరెడ్డి, యాదయ్య, బాల్‌రాజు, మహేశ్, సురేశ్ ఉన్నారు.

విజ్ఞాన భవనాన్ని ప్రారంభించేదెప్పుడో?



ప్రారంభానికి నోచుకోని గ్రంథాలయ భవనం



అద్దె ఇంట్లో కొనసాగుతున్న లైబ్రరీ

- అసౌకర్యాల మధ్య గ్రంథాలయ నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న పాఠకులు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: అన్ని ఉన్న అల్లుని నోట్లో శకుని అన్న చందంగా మారింది కొత్తూరు గ్రంథాలయం పరిస్థితి. గత భవనంలో పలు సౌకర్యాలు లేక పాఠకులు ఇబ్బందులుపడ్డారు. కాగా పాఠకులకు అన్ని సౌకర్యాలు, వసతులతో కూడిన నూతన భవన నిర్మాణ పనులు గత రెండేళ్లుగా కొనసాగుతున్నా పూర్తికాలేదు. దీంతో తాత్కాలికంగా అద్దె షెటర్లో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి పాఠకుల సంఖ్య గణనీయంగా తగ్గింది. పట్టించుకోవాల్సిన పాలకులు, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో నూతన భవన నిర్మాణ పనులు చివరిదశలో నిలిచిపోయాయి.

తగ్గిన పాఠకుల సంఖ్య..

పట్టణంలో ప్రస్తుతం అద్దె షెటర్లో గ్రంథాలయం అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. గతంలో గ్రంథాలయానికి 150 మంది వరకు పాఠకులు వస్తుండగా స్థలాభావం కారణంగా ప్రస్తుతం కేవలం 25 మంది పాఠకులు మాత్రమే వస్తున్నారు. ప్రస్తుతం గ్రంథాలయంలో నిత్యం 14 దినపత్రికలు అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా ఆయా పోటీ పరీక్షలకు సంబంధించిన 700 పుస్తకాలు, ఇతర మ్యాగ్జిన్లు పాఠకుల కోసం ఉన్నాయి.

ఇదీ పరిస్థితి..

గత రెండేళ్ల క్రితం సుమారు రూ.75 లక్షలతో కాంట్రాక్టర్ కొత్తూరు పట్టణంలో నూతన గ్రంథాయల భవన నిర్మాణ పనులు ప్రారంభించాడు. కాగా నిధులు సరిపోకపోవడంతో ఆ శాఖ అధికారుల అనుమతితో రూ.10 లక్షలు అదనంగా వెచ్చించి పనులు చేపట్టాడు. ప్రస్తుతం పనులు చివరిదశలో ఉండగా.. అధికారుల నుంచి కాంట్రాక్టర్ చేపట్టిన అదనపు పనుల బిల్లులు రూ.10లక్షలు మంజూరు కావడంలేదు. దీంతో కాంట్రాక్టర్ గ్రంథాలయ భవనానికి తాళం వేశాడు. విషయం తెలిసినా గత ఏడు నెలల నుంచి అటు పాలకులు ఇటు అధికారులు కాంట్రాక్టర్ బిల్లుల విషయం తేల్చడం లేదు. దీంతో అద్దె షెటర్లో నిర్వహిస్తున్న గ్రంథాలయంలో పాఠకులు అసౌకర్యాల మధ్య ఇబ్బందులు పడుతున్నారు.

పాఠకుల సంఖ్య తగ్గుతుంది

ప్రస్తుతం పట్టణంలో అద్దె ఇంట్లో గ్రంథాలయం కొనసాగుతోంది. అక్కడ స్థలాభావం కారణంగా పాఠకుల సంఖ్య తగ్గుతోంది. గతంలో 150 నుంచి 200 వరకు ప్రతిరోజు పాఠకులు వస్తుండగా, ప్రస్తుతం 25 నుంచి 30 మంది పాఠకులే వస్తున్నారు.

– శ్రీనివాస్‌రాజు, కొత్తూరు, లైబ్రేరియన్

బిల్లుల కోసమే తాళం వేశారు

కొత్తూరు పట్టణంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.75లక్షలు మంజూరయ్యాయి. కాగా చివరి దశలో నిధులు సరిపోకపోవడంతో కాంట్రాక్టర్ అదనంగా డబ్బులు వెచ్చించి పనులు చేపట్టాడు. బిల్లులు ఇవ్వని కారణంగానే భవనానికి తాళం వేశాడు.

– విక్రమ్, ఏఈ, ఈడబ్ల్యూఐడీసీ